తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ గురువారం 02 - 04 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 4






## మోత్కూరు అగ్నిమాపక కేంద్రానికి

# స్వంత భవనం మంజూరు

- ప్రభుత్వ ఆస్పత్రి వెనకాల ఐసీడీఎస్ వద్ద 10 గుంటల స్థలం కేటాయింపు
- రూ.2 కోట్లతో స్వంత భవనం నిర్మాణం..?



### 2018లో అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు అగ్నిమాపక కేంద్రానికి స్వంత భవనం మంజూరైనట్టు తెలిసింది. ఇంత కాలం స్థలం సమస్య, స్వంత భవనం లేక పోవడంతో త్వరలోనే స్వంత భవనంలోకి అగ్నిమాపక కేంద్రం వెళ్లనుంది. అగ్నిమాపక కేంద్రానికి అనువైన స్థలం కోసం ఫైర్ ఆఫీసర్లు పలుచోట్ల ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించగా కొన్ని స్థలాలు అనుకూలంగా లేకపోవడం, మరికొన్ని చోట్ల చిక్కులు ఉండటంతో స్థలం ఎంపికలో ఆలస్యం జరిగింది. ఎట్టకేలకు స్థలం కూడా ఖరారు కావడంతో స్వంత భవనంకు లైన్ క్లియర్ అయ్యింది. మోత్కూరు మున్సిపల్ కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రి వెనకాల ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఫైర్ ఆఫీసర్లు ఎంపిక చేయగా రెవెన్యూ అధికారులు ఇటీవల కేటాయించగా అగ్నిమాపక అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుని అక్కడ బోర్డు కూడా పెట్టారు. స్థలం ఖరారు కావడంతో స్వంత భవనం కోసం అగ్నిమాపక అధికారులు ప్రతిపాదనలు పంపగా సుమారు రూ.2 కోట్ల నిధులతో అగ్నిమాపక కేంద్రానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వంత భవనం నిర్మించనున్నారని, త్వరలోనే అందుకు సంబంధించిన విధివిధానాలు, అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

### అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ 2018లో మోత్కూరుకు అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయించారు. ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఏవైనా అగ్ని ప్రమాదాల సమయంలో సరైన సమయానికి అగ్నిమాపక యంత్రం రాక తీవ్ర నష్టాలు జరిగేవి. మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రత్యేక చొరవతో అగ్నిమాపక కేంద్రం మంజూరు కాగా 2018 సెప్టెంబర్ 5న ఆయన చేతుల మీదుగా మోత్కూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరింది. మోత్కూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుతో మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), తిరుమలగిరి, అమ్మనబోలు తదితర చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అందుబాటు లోకి వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా హై ఎక్విప్ మెంట్ ఉన్న 2017 మోడల్( మల్టీ పర్పస్ టెండర్) కొత్త వాహనం ఇప్పించగా సుమారు ఏడాది క్రితం ఆ వాహనాన్ని చౌటుప్పల్‌కు పంపించి అక్కడ ఉన్న పాత వాహనాన్ని ఇక్కడకు పంపారు. స్వంత భవనం కోసం అప్పట్లోనే కిశోర్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టగా సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో పడింది. అప్పటి నుంచి అగ్నిమాపక కేంద్రం స్థానిక గెస్ట్‌హౌస్ ఆవరణలో ఉన్న మూత పడిన ఆర్‌అండ్‌బీ పాత భవనంలోనే కొనసాగుతుంది. ఎట్టకేలకు అగ్నిమాపక కేంద్రం ఉన్నతాధికారుల చొరవతో మోత్కూరు అగ్నిమాపక కేంద్రానికి స్వంత భవనం మంజూరైంది.

# బియ్యం పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ బాలమణి



ప్రజావారధి/ఆలేరు

ఆలేరు మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణంలో బుధవారం ఆలేరు మున్సి పల్ చైర్మన్ బీజాని బాలమణిభాస్కర్ లబ్దిదా రులకు బియ్యం పంపిణీ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జట్ట నీరజసిద్దులు, బొట్ల సంపత్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఏనుగుల మత్స్యగిరి తల్లి పద్మకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.43 వేల చెక్కును బుధవారం మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ యాదయ్య, 5వ వార్డు మెంబర్ వంగూరి శ్రీకాంత్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి చెక్కు మంజూరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ ఎస్కె.సాజిద్ పాషా, ఎలుగు కోటిలింగం, దేవసరి రాములు, వల్లపు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# నానో యూరియా వాడకంతో అధిక దిగుబడి

ప్రజావారధి/శాలిగౌరారం

నానో యూరియా వాడకం ద్వారా తక్కువ ఖర్చులోనే ఎక్కువ దిగుబడి సాధించవచ్చని శాలిగౌరారం మండల వ్యవసాయాధికారిణి ఎస్. సౌమ్య శృతి తెలిపారు. శాలిగౌరారం మండల కేంద్రంలో రైతులకు బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక చిన్న డబ్బాలోని 500 మిల్లీలీటర్ల ద్రావణం 45 కిలోల యూరియా బస్తాతో సమానమని, ఇది పర్యావరణ హితమైనదని, మట్టి నాణ్యతను కాపాడుతుందన్నారు. ఒక లీటరు నీటి లో 10 ఎంఎల్ నానో యూరియా కలిపి పిచికారీ చేయాలని, డ్రోన్ ద్వారా స్ప్రే చేస్తే 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ అయితే 250 మిల్లీలీటర్లు, 20 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ అయితే 500 ఎంఎల్ సరిపోతుందని చెప్పారు. పంట వేసిన తర్వాత మొదట సాధారణ యూరియా, డీఏపీ వాడి పిలకలు వచ్చే దశ నుంచి నానో యూరియా పిచికారి చేయాలని సూచించారు. నానో యూరియా వాడకంతో మంచి దిగుబడి వస్తుందని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

ప్రజావారధి/ఆలేరు



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు ఓ జేసీబీని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు, మర్రిగూడెంకు చెంది న జేసీబీ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఆలేరు ఎస్హెచ్‌వో యాలాద్రి విలేకరులకు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయం

- మృతుని కుటుంబానికి వాట్సప్ గ్రూప్ చేయూత
- రూ. 33 వేల నగదు, క్వింటా 25 కిలోల బియ్యం అందజేత

ప్రజావారధి/మోత్కూరు

మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన కన్నెబోయిన సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ దాతలు, సభ్యుల సహకారంతో అందించిన రూ.33 వేల చెక్కు, క్వింటా 25 కిలోల బియ్యం బుధవారం మృతుని భార్య ఎల్లమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాట్సప్ గ్రూప్ జిల్లాలోనే ఆదర్శనీయమైందని, ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, శ్రీ రామలింగేశ్వర ఆలయ చైర్మన్ గుండగోని రామచంద్రు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ గనగాని నర్సయ్య, వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, కోమటి మత్స్యగిరి, చొల్లేటి నరేష్, మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్, జంగ నర్సయ్య, పురుగుల రమేష్, జంగ సతీష్, వడకాల యాదగిరి, కె.గిరి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
02 - 04 - 2026



## ముశిపట్ల బుగ్గరామలింగేశ్వరస్వామి గుట్టపై

# వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మండలం ముశిపట్ల గ్రామంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి గుట్టపైన ఉన్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు అత్యంత శ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. అయ్యస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించారు. ముందుగా గణపతి హోమం నిర్వహించి గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వాములకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో పాటు గంధం, విభూతి, పసుపు, కుంకుమ, పూలు, పండ్లతో అభిషేకాలు జరిపి పూలు, పండ్లు, దీపాలతో అలంకరించిన పడి 18 మెట్లపై కర్పూరం వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్న ప్రసాదం అందించారు. పూజా కార్యక్రమాలను పురోహితులు మోత్కూర్ ప్రదీప్‌శర్మ, మోత్కూర్ సందీప్‌శర్మ, హర్ష వర్ధన్‌శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, ఉపసర్పంచ్ అంజయ్య, బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మడిగె శేఖర్, అయ్యప్పస్వామి భక్తులు మజ్జిగ మధుసూదన్ రెడ్డి, బాహుపెల్లి విజయ్ కుమార్, తండ సత్తయ్య, సుదగాని పాండు, పట్టూరి శివ, బీసు రాంబాబు, బండారు రాజేంద్రప్రసాద్, ఆరాని శేఖర్, బండ నర్సిరెడ్డి, బద్దిశెట్టి సంతోష్, శేఖర్, బాసోజు లక్షణాచారి, చెన్నూరు శ్రీపతి, జిల్లా కనకరత్నం, పొలాసు సాయి కిరణ్, సోమన్న, మజ్జిగ హర్షవర్ధన్ రెడ్డి, బండి నర్సింహ, తాండ్ర నారాయణ స్వామి, కరుణాకర్, రాధారపు మల్లేష్, మేరుగు రాజశేఖర్, నర్సింహ, శ్రీను, కృష్ణారెడ్డి, వీరస్వామి, రాంరెడ్డి, దశరథ రెడ్డి, తాడూరు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



## యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి

## శారాజీపేట పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ప్రజావారధి/ఆలేరు

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఆలేరు మండలం శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, వార్డులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది విధులకు సక్రమంగా వస్తున్నారా లేదా అని డైలీ అటెండెన్స్ లాగిన్‌లో పరిశీలించారు. రోజూ ఆస్పత్రికి వచ్చే ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులను ఇబ్బందులకు గురి చేయకుండా వైద్య సేవలు అందించాలని, వారికి అవసర మైన మందులు ఇవ్వాలన్నారు. విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రికి సరఫరా అవుతున్న మందుల వివరాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది రికార్డులు పరిశీలించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, డాక్టర్లు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.